క్లుప్తంగా

1న ఇంటి వద్దే ఫించన్ల పంపిణీ

కొల్లిపర: ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌ను జులై ఒకటవ తారీకున సచివాలయం సిబ్బంది ప్రభుత్వ ఉద్యోగులు కలసి లబ్ధిదారులకు ఇంటి వద్దకే అందిస్తారని ఎంపీడీవో బి.వై. విష్ణు ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన పెన్షన్ పంపిణీపై సచివాలయం సిబ్బందికి ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొల్లిపర మండలంలో 9864 పెన్షన్లకు గాను ఆరు కోట్ల 50 ఎనిమిది లక్షల 91000 పంపిణీ చేయుచున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన పింఛన్ ప్రకారం ఏప్రిల్ మే జూన్ నెలల బకాయి కూడా కలిపి అధికారులు పంపిణీ చేయుచున్నట్లు తెలిపారు అధికారులు ఇంటి వద్దకే పింఛన్ ఇవ్వటం జరుగుతుందని కావున లబ్ధిదారులు సచివాలయం వద్దకు గాని బ్యాంకు వద్దకు గాని వెళ్ళవద్దని కోరారు పంపిణీ కార్యక్రమం పై మండలంలో ఆయా గ్రామాలకు పర్యవేక్షణకు మండలస్థాయి అధికారులను నియమించినట్లు పంపిణీ పూర్తయ్యే వరకు అధికారులు నియమించిన అధికారులు నిత్యం పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ పరిపాలన ఏవో వి చంద్రమోహన్, సచివాలయం సిబ్బంది వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి



ఫిరంగిపురం: బడి ఈడు పిల్లలను తప్పనిసరిగా వారి తల్లిదండ్రులు బడిలో చేర్పించాలని పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ షేక్ మస్తాన్‌వలి అన్నారు. మండలంలోని నుదురుపాడు ఎంపీపీ పాఠశాల(హెచ్‌ఈ)లో శుక్రవారం నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయివేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఏవీవీ లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డివైడర్‌పైకి దూసుకెళ్లిన లారీ

ఫిరంగిపురం: ప్రమాదవశాత్తూ కెమికల్ పౌడర్ లోడుతో వస్తున్న లారీ డివైడర్‌పైకి దూసుకెళ్లిన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కడప నుంచి కెమికల్ పౌడర్ లోడుతో రాజమండ్రికి వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తూ ఫిరంగిపురంలోని పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న డివైడర్ పైకి దూసుకెళ్లింది. దీంతో లారీ ముందు భాగం బాగా దెబ్బతింది. ఎవరికి ఎటువంటి ప్రమాదం సంభవించ లేదు. కాగా ఆ ప్రాంతంలో చీకటిగా ఉండి డివైడర్ కన్పించకపోవడంతో ప్రమాదం సంభవించిందని లారీ డ్రైవర్ మున్నా తెలిపాడు.

దివ్యాంగ విద్యార్థులకు నిత్యావసర సరుకులు అందజేత

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి ముగ్గురోడ్‌లోని భవిత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న దివ్యాంగ విద్యార్థులకు మదర్ థెరిసా హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఫౌండర్ పరమేష్ శుక్రవారం నిత్యావసర వస్తువులను తాడేపల్లి మండల విద్యాధికారి డి.నాగేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో నాగేశ్వరరావు మాట్లాడుతూ భవిత పాఠశాలలోని దివ్యాంగ విద్యార్థులకు 25 కేజీల బియ్యం, 1 కేజీ నూనె, రవ్వ, కూరగాయలు, సోప్స్ వంటి నిత్యావసర వస్తువులు అందజేస్తున్న పరమేష్‌కు అభినందనలు తెలియజేశారు. ప్రతి 3 నెలలకు ఒకసారి నిత్యావసర సరుకులు అందజేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సహిత విద్య ఉపాధ్యాయులు బి.హరికృష్ణ, వి.సునీత కుమారి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వాసవీమాత ఆలయ వార్షికోత్సవం

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ ఆరవ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలను అర్చకులు రాజేంద్ర శర్మ నిర్వహించి అష్టోత్తర, సహస్ర నామ పూజలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై వింజావాసిని సమేత నగరేశ్వర స్వామి, సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి, వల్లీ, దేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్లకు వేదపండితులు బి.వెంకట సుబ్రహ్మణ్య శర్మ, వంశీకృష్ణ శర్మ, గౌరీశ్వర శర్మ, సాయినాథ్ శర్మలు కల్యాణం నిర్వహించారు. పూజల్లో ఎం.సత్యనారాయణ, నరసింహారావు దంపతులు పాల్గొన్నారు. మధ్యాహ్నం గీతా భజన మండలి వారిచే లలితా సహస్ర నామ పారాయణ గావించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు డి.నరేంద్రకుమార్, గుగ్గిలం మధుసూదన్‌రావు, కె.వెంకటేశ్వర్లులు పర్యవేక్షించారు.

రేపు పాతబొమ్మువానిపాలెంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



ఆహ్వానపత్రికను ఆవిష్కరించిన యంద్రపాటి అశోక్‌కుమార్, తదితరులు

తెనాలి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం కొల్లిపర మండలం పాతబొమ్మువానిపాలెంలో ఆవిష్కరించనున్నారు. కార్యక్రమ ఆహ్వాన పత్రికను శుక్ర వారం సాయంత్రం స్థానిక రామలింగేశ్వరపేటలో ఆవిష్కరించి వివరాలు తెలియజేశారు. ది బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి యంద్రపాటి అశోక్ కుమార్ మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం 5 గంటలకు జరిగే విగ్రహావిష్కరణ, సభకు అంబేద్కర్ మనుమడు, సమతా సైనిక్‌దళ్, ది బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా, గ్లోబల్ రిపబ్లికన్ పార్టీ జాతీయ అధ్యక్షుడు భీమ్‌రావ్ యశ్వంతరావ్ అంబేద్కర్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. సభకు ముందుగా మధ్యాహ్నం 3 గంటలకు దావులూరు అడ్డరోడ్డు నుంచి విగ్రహావిష్కరణ సభా ప్రాంగణం వరకూ భారీ ర్యాలీ ఉంటుందన్నారు. ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్, ప్రముఖ చరిత్రకారుడు బొనిగల రామారావు, దళిత స్త్రీ సాహిత్య పరిషత్ కన్వీనర్ బీఎం లీలాకుమారి, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం కాలేజి ప్రిన్సిపల్ డాక్టర్ చల్లపల్లి స్వరూపరాణి, హైకోర్టు న్యాయవాది చందోలు శోభారాణి తదితర ప్రముఖులు, గ్రామ సర్పంచ్ కొల్లి రజని మాజీ సర్పంచ్ బొమ్ము శ్రీనివాసరెడ్డి పాల్గొంటారని తెలియజేశారు. రాష్ట్ర నలుమూలల నుంచి మేధావులు, బుద్ధిస్టులు, అంబేద్కర్ వాదులు పాల్గొంటున్న సభను జయప్రదం చేయాల్సిందిగా ఆయన కోరారు. నాగార్జున కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ డాక్టర్ కారుమంచి రవికుమార్ మాట్లాడుతూ భావితరాలకు అంబేద్కర్ ఆశయ స్ఫూర్తిని తెలియజేసేందుకు నిర్వహించే కార్యక్రమం విజయవంతం కావాలన్నారు. ఉపాధ్యాయులు కనపర్తి బెన్హర్, చుండూరు దళిత బాధితుల పోరాట కమిటీ జాలాది మోజెస్ మాట్లాడారు. డాక్టర్ అంబేద్కర్ యువజన సమైఖ్య, విగ్రహ నిర్వహణ కమిటీ, శ్రీకృష్ణ కో-ఆపరేటివ్ సొసైటీ, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో జరిగే విగ్రహావిష్కరణ గోడపత్రికను ముందుగా ఆవిష్కరించారు. వీరితో పిల్లి జయపాల్, తూమాటి అంబేద్కర్, దాసరి చినవంటిబాబు, పిల్లి నరశింహారావు ఉన్నారు.

కొనసాగుతున్న శ్రీనక్షత్ర శాంతి మహాయజ్ఞం



స్వామివారికి అభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

తెనాలి: స్థానిక గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠం, సాలిగ్రామ మఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీనవగ్రహ సహిత శ్రీనక్షత్ర శాంతి మహాయజ్ఞం కొనసాగుతోంది. 16వ రోజైన శుక్రవారం పూర్వభద్ర నక్షత్రం వారితో గణపతి పూజ, రుద్రాభిషేకం, గణపతి హోమం, నవగ్రహ హోమం, నక్షత్ర శాంతి హోమం, మృత్యుంజయ హోమాన్ని యల్లాప్రగడ పవన్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో రుత్వికులు జరిపించారు. ప్రజ్ఞానంద సరస్వతి (బాల స్వామీజీ) అనుగ్రహ భాషణ చేశారు. సాయంత్రం శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జీవిత చరిత్రను మూడోరోజు భక్తులకు వివరించారు. ట్రస్ట్ చైర్మన్ నంబూరు వెంకట కృష్ణమూర్తి, సహాయ కార్యదర్శి ముద్దాభక్తుని రమణయ్య, పెనుగొండ వెంకటేశ్వరరావు, రావూరు సుబ్బారావు, గోపు రామకృష్ణ, కోన నాగేశ్వరరావు, చుండూరు లోకనాథం, రాజేశ్వరరావు, రాంబాబు, జయలక్ష్మి మాతృ మండలి సభ్యులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ సమావేశం

తెనాలిఅర్బన్: పట్టణ మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని నేడు నిర్వహించనున్నట్లు కమిషనర్ బండి శేషన్న తెలిపారు. శనివారం ఉదయం 11.00 గంటలకు మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో జరిగే సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన వహిస్తారని చెప్పారు. సమావేశంలో కౌన్సిలర్‌లు, కో-ఆప్షన్ సభ్యులు, ఎక్స్ అఫిషియో సభ్యులు పాల్గొనాలని కోరారు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

తెనాలిరూరల్: జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగపర్చుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి. శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ అవడం ద్వారా కక్షిదారులకు ఆర్థిక పరంగానూ వెసులుబాటు కలుగుతుందని, కోర్టుల్లో ఉన్న కేసులనూ రాజీ చేసుకోవచ్చని తెలిపారు. కేసుల లిటిగేషన్ విపరీతంగా పెరగడం వల్ల వాటిని పరిష్కరించే దిశగా లోక్ అదాలత్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సివిల్ కేసులు ఏ దశలో ఉన్నా పరిష్కరించుకోవచ్చని సూచించా రు. రాజీ కాదగిన సివిల్, క్రిమినల్, ప్రి లిటిగేషన్, వాహనాలు, బ్యాంకులు, బీఎస్ఎన్ఎల్, భరణాల కేసులు రాజీ చేసుకోవచ్చన్నారు. ప్రజలందరూ న్యాయశాఖ ఇచ్చిన లోక్ అదాలత్‌ను వినియోగించుకోవచ్చన్నారు.

రిజర్వేషన్లపై పాట్నా హైకోర్టు తీర్పును వ్యతిరేకిద్దాం

ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

తెనాలి: బీహార్ రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన సామాజిక రిజర్వేషన్లు 50 శాతానికి మించటం సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధమంటూ, పాట్నా హైకోర్టు రద్దు చేయడాన్ని తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని ఆంధ్ర ప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు శుక్రవారం ఒక ప్రటకనలో తెలియజేశారు. ముమ్మాటికీ ఇది బడుగు బలహీన వర్గాలకు వ్యతిరేకమైన తీర్పుగా ఆందోళన వ్యక్తంచేశారు. న్యాయస్థానాల తీర్పుల్లో కూడా పేదలు- బడుగుల పట్ల వివక్షత ఉంటుందనడానికి, పాట్నా హైకోర్టు తీర్పు ఒక నిదర్శనంగా ఉంటుందన్నారు. ఏ కమిషన్ సిఫార్సులు, ఎట్టి గణాంకాలు ప్రాతిపదికలుగా చెప్పకుండానే, రాజ్యాంగ విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం, 10 శాతం కూడా లేని అగ్రకుల పేదలకంటూ తెచ్చిన 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లకు మాత్రం అనుకూల తీర్పులు ఇవ్వడం, అణగారిన వర్గాలకు రిజర్వేషన్లు ఇవ్వాల్సివస్తే మాత్రం, అడ్డు పుల్లలు వేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. అగ్రవర్ణాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించినప్పుడు మొత్తం రిజర్వేషన్లు 60 శాతం సీలింగ్ దాటినప్పుడు లేని అభ్యంతరం, బీహార్లో శాస్త్రీయంగా జనగణనలో సమగ్ర కులగణన నిర్వహించి, ఆ కులగణనల ఆధారంగా పెరిగిన జనాభా మేరకు, రిజర్వేషన్లను ఆ రాష్ట్ర ప్రభుత్వం పెంచితే మాత్రం పెంప చెల్లదంటూ, పాట్నా హైకోర్టు తీర్పునివ్వడం అన్యాయం- అధర్మమంటూ శంకరరావు వాపోయారు. ఈ లెక్కన చూస్తుంటే కులాల వారీగా, ఎవరి జనాభా దామాషా మేరకు వారికి సమస్త రంగాలలో రిజర్వేషన్లు దక్కడం న్యాయవ్యవస్థకు ఇష్టం లేనట్లుగా భావించాల్సి వస్తుందన్నారు. ఈ విషయమై త్వరలో ఢిల్లీలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి, అట్టడుగు వర్గాలకు ముఖ్యంగా బీసీల జనాభా దామాషా మేరకు రిజర్వేషన్ల సాధన కోసం గల్లీ నుండి ఢిల్లీ వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు.

రైలు నుంచి జారిపడి ప్రయాణికుడి మృతి

తెనాలిరూరల్: రైలు నుంచి జారిపడి ప్రయాణికుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. విశాఖ జిల్లా రాంబిల్లి మండలం వడపాలెం గ్రామానికి చెందిన సూరాడ దేవుడు (56) తన కుటుంబసభ్యులు, బంధువులతో కలసి తిరుపతి వెళ్లేందుకు తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో గురువారం బయలుదేరాడు. తెనాలి రైల్వేస్టేషన్ మూడో నంబరు ప్లాట్‌ఫాం వద్దకు రాగా ప్రమాదవశాత్తు రైలుకు, పట్టాల మధ్యలో పడి మృతి చెందాడు. ఇది గమనించని కుటుంబ సభ్యులు అదే రైలులో తిరుపతి వెళ్లిపోయారు. ఘటనపై సమాచారం అందుకున్న తెనాలి జీఆర్పీ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి, అతని జేబులో ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా వివరాలు సేకరించారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బయాలజీ విభాగానికి ఎన్‌ఏబీఎల్ గుర్తింపు



గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల మైక్రో బయాలజీ విభాగానికి ఎన్ఏబీఎల్(నేషనల్) గుర్తింపు మరోసారి రావడంపై గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆసుపత్రిలో మైక్రో బయాలజీ వైద్యులను ఆయన అభినందించారు. ఎన్నో సంవత్సరాల విశేష కృషి వల్ల ఎన్ఏబీఎల్ మరోసారి మైక్రోబయాలజీకి వచ్చిందని, ఇది అందరి సమష్టి కృషితో సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో మైక్రో బయాలజీ విభాగాధిపతి డాక్టర్ పరమేశ్వరి, డాక్టర్ ఇజ్రాయేల్, పవన్ కుమార్, నాగేశ్వరావు, ముస్తఫా పాల్గొన్నారు.

కౌలు రైతులు గుర్తింపు కార్డులు తీసుకునేలా చూడండి



మాట్లాడుతున్న తహసీల్దార్ రవిబాబు



సమావేశానికి హాజరైన రెవెన్యూ, అగ్రికల్చర్ సిబ్బంది

దుగ్గిరాల తహసీల్దార్ రవిబాబు


తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలంలో 18 గ్రామాల్లో కౌలుకు పంట సాగు చేసుకునే కౌలు రైతులు తప్పనిసరిగా గుర్తింపు కార్డులు తీసుకునే విధంగా చర్యలు చేపట్టాలని దుగ్గిరాల తహసీల్దార్ రవిబాబు అన్నారు. శుక్రవారం దుగ్గిరాల తహసీల్దార్ కార్యాలయంలో పలు గ్రామాల రెవెన్యూ, అగ్రికల్చర్ సిబ్బందికి మండల అగ్రికల్చర్ ఆఫీసర్ పి.శిరీష శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తహసీల్దార్ రవిబాబు మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల్లో భూమి లేక కౌలుకు పంట సాగు చేసుకునే రైతులకు కౌలు రైతు సర్టిఫికెట్లను సకాలంలో జారీ చేయాలని అన్నారు. కౌలు రైతు కార్డు తీసుకోవడం ద్వారా కౌలు రైతులకు ప్రభుత్వం అందించే రాయితీలు, పంట బీమా, ప్రకృతి వైపరీత్యాల వలన నష్టం వాటిల్లినప్పుడు పంట నష్ట పరిహారం పొందే అవకాశం ఉందని వారికి వివరించాలని సూచించారు. ఈ గుర్తింపు కార్డు తీసుకోవడం ద్వారా ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు కూడా తీసుకోవచ్చని, రైతులు జాయింట్ లయబిలిటీ గ్రూపులుగాను, బ్యాంకు ద్వారా రుణాలు పొందుటకు ఉపయోగపడుతుందని తెలియజేయాలని అన్నారు. రెవెన్యూ, అగ్రికల్చర్ సిబ్బంది గ్రామాల్లో కౌలు రైతులను గుర్తించి వారికి ఈ విషయాలను తెలియజేసి కౌలు కార్డు అందే విధంగా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాజేష్, సీనియర్ అసిస్టెంట్ చిట్టిబాబు, వ్యవసాయ విస్తరణ అధికారి రమేష్‌బాబు, వీఆర్వోలు, వీఏఏలు, ఎంపీఈవోలు, వీహెచ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

హేన దీప్తికి అభినందనలు

నెహ్రూనగర్: అంతర్జాతీయ స్థాయిలో టెక్నాలజీ రైజింగ్ స్టార్‌గా గుంటూరు నగరానికి చెందిన కొండా హేన దీప్తి అర్హత సాధించడం అభినందనీయమని భీమ్ సేన సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపు నీలాంబరం పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆమె కుటుంబ సభ్యులతో కలిసి లాడ్జి సెంటర్‌లో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెనడాలో పనిచేస్తున్న హేన దీప్తి అమెజాన్ కంపెనీలో 6వ లెవల్‌లో పనిచేస్తూనే యాపిల్, గూగుల్, ఆర్‌టీఎక్స్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ సెంటర్స్‌లో టెక్నాలజీ రైజింగ్ స్టార్ అవార్డుకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు.

212 మందికి వైద్య పరీక్షలు





హాజరైన ప్రజలు

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు హెల్త్ వెల్‌నెస్ సెంటర్లో శుక్రవారం ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యురాలు శ్వేత 212 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. బాలింతలు, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డయేరియా వల్ల వచ్చే ఇబ్బందులు వారికి వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, ఎంఎల్‌హెచ్‌పీ స్వప్న, ఎంపీహెచ్ఎస్ బాబురావు, ఏఎన్ఎం ఆంథోనిరాణి, ఆశా కార్యకర్తలు పద్మ, సుజాత, జోజమ్మ, శాంతకుమారి, శాంతరాణిలు పాల్గొన్నారు.

యువ డిఫెన్స్ అకాడమీలో 'డ్రగ్ ఫ్రీ సూపర్ హీరో'

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని కొలనుకొండలో గల యువ డిఫెన్స్ అకాడమీలో నవజీవన బాలభవన్ ఆధ్వర్యంలో డ్రగ్ ఫ్రీ సూపర్ హీరో కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నవజీవన్ బాలభవన్ జోనల్ కో ఆర్డినేటర్ బి.రమేష్ మాట్లాడుతూ అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రచార వారోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, యువత దేశానికి ఆదర్శం కావాలని, మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోరాదని అన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకుని కుటుంబానికి, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని, దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉందని వివరించారు. ప్రతి విద్యార్థి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో మత్తు పదార్థాల నిర్మూలనకు అంతఃకరణ శుద్ధితో పాటుపడతామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో యువ డిఫెన్స్ అకాడమీ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ శంకరబాబు, నవజీవన్ బాలభవన్ జోనల్ కో ఆర్డినేటర్ డి.విజయరాణి, యువ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు పాల్గొన్నారు.

పీవీ నరసింహారావు సేవలు మరువరానివి



పీవీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ సాంబశివుడు

తెనాలిఅర్బన్: పివి నరసింహారావు భారతదేశానికి అందించిన సేవలు మరవరానివని కాంగ్రెస్ పార్టీ తెనాలి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చందు సాంబశివుడు కొనియాడారు. భారత మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు 103వ జయంతిని బోసురోడ్డులోని ఆయన విగ్రహం వద్ద శుక్రవారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాంబశివుడు మాట్లాడుతూ భారత ప్రధానిగా అనేక సంస్కరణలను తీసుకువచ్చారని గుర్తు చేశారు. తెలుగువారి కీర్తిని దేశం అంతటా వ్యాపింప చేశారని తెలిపారు. ఆయనకు భారతరత్న ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పొన్నూరు నాగసూర్య శశిధరరావు, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు దారా రామకృష్ణ, నాయకులు భీమ రమేష్, పి.శివకుమార్, పి.శివన్నారాయణ, వై.శంకరరావు, కె.వీరాస్వామి, ఎస్.మల్లిఖార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

కాల్వల్లో మురుగు చేరనివ్వకండి

కమిషనర్ శేషన్న ఆదేశం



మ్యాన్‌హోల్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: కాల్వల్లో మురుగు చేరకుండా తగు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. బుర్రిపాలెం రోడ్డులోని మురుగు కాల్వల పూడికతీత పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. కాల్వల్లోని వ్యర్థాలను పూర్తిగా తొలగించాలని ఆదేశించారు. అలాగే తరచు వర్షాలు పడుతున్న నేపథ్యంలో రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. రోడ్లపై ఉన్న నీరు కాల్వలోకి వెళ్లే విధంగా తగు ఏర్పాట్లు చేయాలన్నారు. కాల్వల్లో వ్యర్థాలు వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు దావులూరి శ్రీనివాసరావు, అనుపమ, రామచంద్రరావు, డీఈ నాగభూషణం, ఆర్కికల్చర్ ఆఫీసర్ శేషుబాబు, పలువురు ఉద్యోగులు ఉన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం



పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి డాక్టర్ సుబ్బరాయణం

ఫిరంగిపురం: ప్రతి ఒక్కరూ శరీర శుభ్రత పాటించడం ద్వారానే ఆరోగ్యంగా ఉండవచ్చని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టీఎంకే సుబ్బరాయణం అన్నారు. మండలంలోని నుదురుపాడు గ్రామంలో రైల్వేస్టేషన్ ప్రాంతాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఫ్రైడే-డ్రైడేలో భాగంగా ఆరోగ్య సిబ్బంది చేస్తున్న పనులను ఆయన పరిశీలించారు. రైల్వేస్టేషన్ పరిధిలోని పరిసరాలు, నీటి తొట్లు, సమీపంలో ఉన్న నీటి కుంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో ఆరోగ్య సిబ్బంది ఎంతో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఆరోగ్య సంబంధిత విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తమ ఇంటి చుట్టు పక్కల ప్రదేశాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. నీటి కుంటలు, తొట్లలో నీటిని ఎక్కువ రోజులు నిలువ ఉంచకూడదని చెప్పారు. దాని వల్ల దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగీ వంటి జ్వరాలు వస్తాయని తెలిపారు. ఎప్పటి కప్పుడు ఆరోగ్య సిబ్బంది తమ దృష్టికి వచ్చిన అంశాలను యాప్‌లో అప్‌లోడ్ చేసినట్లయితే వాటికి సంబంధించిన పంచాయతీ సిబ్బంది వాటిని పరిష్కరిస్తారని చెప్పారు. ఆయన వెంట జిల్లా సహాయ మలేరియా అధికారి డి.రాజునాయక్, ఎస్‌యూవో చంద్రశేఖర్, నుదురుపాడు పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

మూడు దేవస్థానాల హుండీల రాబడి రూ.9.32 లక్షలు



కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

నగరంపాలెం: గుంటూరు కొత్త పేటలోని శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానం, శ్రీ జగన్నాథ స్వామి దేవస్థానం, లాలా పేటలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం హుండీల కానుకలను శుక్రవారం లెక్కించారు. దేవస్థానాల సహాయ కమిషనర్ (ఈవో) డి.శ్రీనివాసరావు, పర్యవేక్షణాధికారి టి.శ్రీనివాస్, దేవస్థానాల చైర్మన్ సూరినేడి దుర్గా వరప్రసాద్, ధర్మకర్తల మండలి సభ్యులు భూమా వీర వెంకట భాపారావు, శ్రీ సద్గురు సేవా సమితి ఇన్‌చార్జి, సభ్యుల సహకారంతో లెక్కింపు ప్రక్రియ ఉదయం 8 గంటలకు ప్రారంభమైంది. శ్రీ జగన్నాథ స్వామి దేవస్థానం హుండీలో రూ.9,719, ఆంజనేయస్వామి దేవస్థానం హుండీలో రూ.4,98,977, వేంకటేశ్వరస్వామి దేవస్థానం హుండీలో రూ.4,24,254 నగదు వచ్చిందని ఏసీ తెలిపారు. మూడు నెలలకు కలిపి మూడు దేవస్థానాలకు రూ.9,32,950 ఆదాయం వచ్చిందన్నారు. ఈ లెక్కింపు ప్రక్రియలో ధర్మకర్తల మండలి సభ్యులు ఉడతా మహేష్ కుమార్, దమ్మలపాటి విజయ నిర్మల, ఇస్లావత్ గాంధీనాయక్, యంబాడి రాంబాబు, సురిబోయిన వెంకట్రావు, వైలవరపు సుజన, తరిమెళ్ల వనజ, జవ్వాజీ లక్ష్మీ పాల్గొన్నారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



ప్రత్యేక ప్రార్థనలో పీఠాధిపతి, భక్తులు

లక్ష్మీపురం: స్థానిక హజ్రత్ మొహీయుద్దీన్ పాలెంలో వేంచేసి ఉన్న హజ్రత్ సయ్యద్ షా మొహీయుద్దీన్ బాద్‌షా ఖాదిరి దర్గాలో శుక్రవారం చంద్రమాన 21వ రోజు సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రతి నెలా చంద్రమాన 21వ రోజు హజ్రత్ మహబూబ్ సుభాని 17వ మనువలు సయ్యద్ షా మొహీయుద్దీన్ బాద్‌షా ఖాదిరి బాబా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు భక్తుల సమక్షంలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని దర్గా పీఠాధిపతి, బాబా 23వ మనువలు పీర్ సయ్యద్ షా సులేమాన్ ఖాదిరి అల్ జిలానీ తెలిపారు. బాబా సమాధిని పూలతో అలంకరించి ధూప దీపాలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరు నగర నడి బొడ్డున ఎంతో మహిమ కలిగిన హజ్రత్ మహబూబ్ సుభాని (గౌసుల్ ఆజం దస్తగిర్) మనువలు దర్గా ఉండటం జిల్లా వాసులు చేసుకున్న అదృష్టమన్నారు. అనంతరం అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నగర ప్రముఖులు, పీర్ మురీదులు, స్థానిక మొహీయుద్దీన్ పాలెం వాసులు తదితరులు పాల్గొన్నారు.

సరళ ఝాన్సీ రాణికి డాక్టరేట్

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ పరిశోధకురాలు జె.సరళ ఝాన్సీరాణికి యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసిందని రీసెర్చ్ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.కిరణ్మయి శుక్రవారం తెలిపారు. కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ పరిశోధన పరిశీలకురాలు డాక్టర్ టి.రమాదేవి పర్యవేక్షణలో 'ఎ స్టడీ ఆన్ ప్రాబ్లమ్స్ ఇన్ మార్కెటింగ్ ఆఫ్ కాటన్ అండ్ ది రోల్ ఆఫ్ డిఫరెంట్ మార్కెటింగ్ ఏజెన్సీస్ - ఎస్పెషల్ రిఫరెంట్ టు వరంగల్, అదిలాబాద్ అండ్ మహబూబ్ నగర్ డిస్ట్రిక్ట్ ఆఫ్ తెలంగాణ' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకు డాక్టరేట్ ప్రదానం చేయడం జరిగింది.